అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 317 | వరంగల్ | గురువారం, 24 సెప్టెంబర్ 2026 | పేజీలు: 06



రంజిత్‌ల‌మారి

S4S



ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ పేరుతో కోట్ల వంచన

టేకుమట్ల నుండే జనాలకు టోకరా

బడుగుల శ్రమను పీల్చుకుతింటున్న జలగ

గార్డుల జీతాల సొమ్ముతో జల్సాలు


తలెత్తిచూడని సంబంధిత అధికారులు

4

నిరుద్యోగం, పేదరికంతో బతుకుదెరువు కోసం పట్టణాలకు వలస వచ్చే జీవులే అతనికి "ఆహారం". కుటుంబ పోషణకు, పొట్ట కూటి కోసం ఏదైనా చేసే వారికి కొంత ఆర్థిక "సెక్యూరిటీ" కావాలనుకునే వారే అతని పెట్టుబడి. ఉద్యోగాల కోసం ఎదురు చూసే వేలాది మందికి ప్రైవేట్ ఏజెన్సీలు సెక్యూరిటీ సిబ్బందిగా, గార్డుగా ఉద్యోగాలు కల్పిస్తాయి. బ్యాంకులు, షాపింగ్ మాల్స్, హాస్పిటల్స్ లో పని చేయడానికి ఈ ఏజెన్సీ లను సంప్రదిస్తుంటాయి. దీనిని అడ్డంపెట్టుకొని S4S అనే ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థ మానవ వనరులను దోచుకొని, వారి చెమట చుక్కలతో జల్సాలు చేస్తున్నది. పేపరుపై వేతనాలు చూపి...సగం సొమ్ము స్వాహా చేస్తున్నది.

- అక్షరశక్తి, ప్రధాన ప్రతినిధి

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



- చెరువులు, వాగులు, నాలాల్లో నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
- ఇబ్బందులు ఎదురయ్యే ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

3

జిల్లాలో భారీ వర్షా లు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించి, జిల్లాలో వర్ష ప్రభావం, ప్రస్తుత పరిస్థితులు, గురు, శుక్రవారాలపాటు వర్షా లకు హై అలెర్ట్ ఉన్న నేపథ్యంలో అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. - అక్షరశక్తి, హన్మకొండ

గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి

- గ్రామసభల తీర్మానాల మేరకే అభివృద్ధి పనులు చేపట్టాలి
- తాగునీరు, రహదారులు, ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి
- సంక్షేమ పథకాలు అర్హులందరికీ సకాలంలో అందాలి
- రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క

2





వందేమాతరం గీతాలాపనలో ప్రజలంతా భాగస్వాములు కావాలి

ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్

అక్షరశక్తి, హనుమకొండ: భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజల్లో దేశభక్తి, జాతీయ స్ఫూర్తిని రగిలించిన వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా విద్యాభారతి ఆధ్వర్యంలో 'కోటిగళాలతో వందేమాతరం' గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 25న ఉదయం 9:30 గంటలకు నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో ఏకకాలంలో వందేమాతరం గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటిచెప్పే ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిమ్మల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

సాయి వర్షినికి సిపి అభినందనలు

- **ఇండియన్ సాఫ్ట్‌బాల్ టీంకు ఎంపికైన సాయి వర్షిని**
- **భారత జట్టు తరుపున అండర్ - 15 ఆసియా కప్‌లో ప్రాతినిధ్యం**

అక్షరశక్తి, హనుమకొండ : ఇండియన్ సాఫ్ట్ బాల్ టీంకు ఎంపికైన క్రీడాకారిని వేల్పుల సాయి వర్షిని నీ నగర పోలీస్ కమిషనర్ శ్వేత అభినందించారు. తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పిల్లి సాంబశివరావు ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా సాఫ్ట్ బాల్ ఆసోసియేషన్ సెక్రటరీ తాబేటి రాజేందర్, ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, కోచ్ పోలేపాక వినయ్ ఆధ్వర్యంలో హెడ్ క్వార్టర్స్ లోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం మర్యాదపూర్వకంగా సీపీని కలిశారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ.. ఇండియన్ టీంకు సాయి వర్షిని ఎంపిక కావడం అభినందనీయమని కొనియాడారు. సాయివర్షినినీ క్రీడాకారిణిగా ఎదిగేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించడం ప్రశంసనీయమని అన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు సాయి వర్షిని గురించి సీపీకి వివరించారు. హన్మకొండ జిల్లా కేంద్రంలోని అనిల్, సుజాత దంపతుల కూతురు సాయి వర్షిని నగరంలోని గ్రీన్ వుడ్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నారని తెలిపారు. చిన్నప్పటినుంచే తల్లిదండ్రులు తమ కూతురు సాయి వర్షిణి అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఎదిగేందుకు తమ వంతు ప్రోత్సాహాన్ని అందించారని తెలిపారు. చైనాలో అక్టోబర్ 12 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న 5వ అండర్ 15 ఉమెన్స్ సాఫ్ట్‌బాల్ ఆసియా కప్ 2026పోటీల్లో సాయి వర్షిని పాల్గొననున్నారని తెలిపారు. సిపి ని కలిసిన వారిలో సాయి వర్షిని తండ్రి అనిల్, అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్ ఉన్నారు.



గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి

- **గ్రామసభల తీర్మానాల మేరకే అభివృద్ధి పనులు చేపట్టాలి**
- **తాగునీరు, రహదారులు, ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి**
- **సంక్షేమ పథకాలు అర్హులందరికీ సకాలంలో అందాలి**
- **రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క**



అక్షరశక్తి, ములుగు : గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మంగపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిధికి చెందిన 23 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను మంత్రి అనసూయ సీతక్క పంపిణీ చేశారు. అనంతరం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతి, గ్రామాల్లో ప్రజలకు అందుతున్న సేవలు, పంచాయతీ నిధుల వినియోగంపై సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను గ్రామసభల ద్వారా గుర్తించి తీర్మానాలు చేయాలని సూచించారు. పనుల అవసరాన్ని, ప్రాధాన్యతను ప్రజల సమక్షంలో నిర్ణయించాలని, చేపట్టిన పనుల వివరాలను గ్రామసభలకు తెలియజేయాలని ఆదేశించారు. ప్రజలకు అత్యవసరమైన పనులకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. తాగునీటి ట్యాంకుల మరమ్మతులు, పైపులైన్ల ఏర్పాటు, ఇతర తాగునీటి పనులను వేగంగా చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. మిషన్ భగీరథ పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించి తాగునీటి సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాలకు ఉపయోగపడే పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వాగులపై చెక్‌డ్యామ్‌లు, వ్యవసాయ కుంటలు, భూగర్భ జలాల పెంపునకు బోరుబావుల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో రహదారులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని తెలిపారు.గ్రామాన్ని కన్నతల్లిలా భావించి పంచాయతీ కార్యదర్శులు బాధ్యతతో పనిచేయాలని మంత్రి సూచించారు. గ్రామాల్లోని ప్రతి సమస్యపై అవగాహన కలిగి ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికతోపాటు గ్రామాభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాలను పారదర్శకంగా రూపొందించాలని ఆదేశించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని మంత్రి తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని శుక్రవారం నుంచి చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డులు లేని అర్హులకు దరఖాస్తు విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. పింఛన్ దరఖాస్తులను త్వరగా పరిశీలించి ఉన్నతాధికారులకు పంపాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ సోమయ్య, మండల ప్రత్యేక అధికారి డీపీవో వెంకయ్య, తహసీల్దార్ తోట రవీందర్, ఎంపీడీవో బద్రు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి వినయ్ భాస్కర్‌పై దాడికి పాల్పడడం దారుణం

- **దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి**
- **మన తెలంగాణ ఆటో డ్రైవర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఇసంపల్లి సంజీవ**





అక్షరశక్తి, హన్మకొండ : మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్‌పై జరిగిన దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఇసంపల్లి సంజీవ పోలీసులను కోరారు. ఈ ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. దాస్యం వినయ్ భాస్కర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్యుల నివేదికతో పాటు మెడికోలీగల్ నివేదికను పరిగణనలోకి తీసుకుని, చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలని సంజీవ కోరారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి, ప్రత్యక్ష సాక్షులు, అందుబాటులో ఉన్న వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించి బాధ్యులను గుర్తించాలని ఆయన సూచించారు.

ఈ విషయంపై వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా స్పందించి, సంబంధిత పోలీసు అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని ఈసంపల్లి సంజీవ కోరారు. ప్రజాప్రతినిధులపై దాడులు జరిగాయనే ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా, ఫిర్యాదులు మరియు వైద్య నివేదికల ఆధారంగా చట్టపరమైన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 14 ఏళ్లపాటు ప్రజలు, ఉద్యమకారులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సుదీర్ఘంగా పోరాటం చేశారని వారు గుర్తు చేశారు. అవే కాకుండా ముఖ్యంగా ప్రణయ భాస్కర్ నుండి 30 ఏళ్ల పాటు సుదీర్ఘంగా అనేక కార్మిక సంఘాలకు గౌరవ అధ్యక్షునిగా ఉంటూ వారి కష్టసుఖాలలో అనేక రకాలుగా పాలుపంచుకొని ఆదర్శ నాయకుడు వినయ్ భాస్కర్ అని గుర్తు చేశారు కార్మిక రంగంతో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేశారు

మానవ సంబంధాలతో కూడిన పాలనతో ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధ పాలన, శాంతియుత వాతావరణం తెలంగాణ సమాజానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అలాంటి రాష్ట్రంలో ప్రజాప్రతినిధులపై దాడులు జరిగాయని ఆరోపణలు రావడం, శారీరకంగా ఇబ్బందులకు గురిచేశారనే ఫిర్యాదులు రావడం ఆందోళనకర అంశమని అన్నారు. వినయ్ భాస్కర్‌పై జరిగినట్లు పేర్కొంటున్న ఘటనకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి, అసలు ఏం జరిగిందనే విషయాన్ని స్పష్టంగా నిర్ధారించాలని ఆయన కోరారు. ఎవరి ప్రమేయం ఉన్నా, విచారణలో ఆధారాలు బయటపడితే వారికి వర్తించే చట్టపరమైన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ ఘటనపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగాలని, బాధితుడి వాంగ్మూలం, వైద్య నివేదిక, మెడికోలీగల్ నివేదికతో పాటు అందుబాటులో ఉన్న అన్ని ఆధారాలను పరిగణనలోకి తీసుకోవాలని సంజీవ ప్రభుత్వాన్ని కోరారు. పోలీస్ కమిషనర్ ఈ అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలించి, సమగ్ర విచారణకు ఆదేశాలు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మన తెలంగాణ ఆటో డ్రైవర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద శ్రీధర్ రెడ్డి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మడికొండ బాబు, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జిలకర స్వామి, రాష్ట్ర అధికార ప్రతినిధి మామిడాల వెంకటేశ్వర్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు చీకటి కుమార్ గుండా రమేష్ పసునూరి బాబు నాయకులు భానోతు శంకర్ నాయక్, కందికొండ చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- చెరువులు, వాగులు, నాలాల్లో నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
- ఇబ్బందులు ఎదురయ్యే ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



అక్షరశక్తి, హన్మకొండ: జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించి, జిల్లాలో వర్ష ప్రభావం, ప్రస్తుత పరిస్థితులు, గురు, శుక్రవారాలపాటు వర్షాలకు హై అలెర్ట్ ఉన్న నేపథ్యంలో అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. మండలాల వారీగా వర్షపాతం, చెరువుల పరిస్థితి, వాగులు, వంకలు, రహదారుల పరిస్థితి తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

గతంలో వర్షాల సమయంలో సమస్యలు ఎదురైన ప్రాంతాల వివరాలను తెలుసుకుని, ఆయా ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టడంపై అధికారులకు కలెక్టర్ పలు ఆదేశాలను జారీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ జిల్లాలోని వేలేరు , ఆత్మకూర్ మండలాల్లో బుధవారం కురిసిన వర్షంతో అధిక వర్షపాతం నమోదైందన్నారు. నేడు, రేపు (గురువారం, శుక్రవారం)కూడా ఆకస్మికంగా భారీ వర్షపాతం నమోదైతే వాగులు, వంకలు పొంగిపొర్లి రహదారులపైకి వరద నీరు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యలను అధికారులు చేపట్టాలన్నారు.

చెరువులు, వాగులు, వంకల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వరద నీరు రహదారులపైకి వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లాలోని అన్ని చెరువుల్లో ప్రస్తుతం ఎంత మేర నీరు ఉందో సాగునీటి పారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు వివరాలను సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షపాతం పెరిగినప్పుడు చెరువుల నీటిమట్టం, నీటి ప్రవాహ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆ శాఖ అధికారులకు సూచించారు.

భారీ వర్షాల సమయంలో అధికారులు తమ పరిధిలో స్థానికంగానే అందుబాటులో ఉండాలని, ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే క్షేత్రస్థాయిలో స్పందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గతంలో వర్షాల సమయంలో ఇబ్బందులు ఎదురైన ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రస్తుతం తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను పరిశీలించాలని ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో నాలాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్తను వెంటనే తొలగించాలన్నారు.

ప్రధాన నాలాల వద్ద వరద నీరు నిలిచిపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అలాగే అన్నీ మండలాల్లో అవసరమైన ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు జేసీబీలు, ఇతర యంత్రాలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా సమస్య వచ్చినట్లయితే వెంటనే సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉంటూ స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో.. కంట్రోల్ రూమ్‌లో అధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అత్యవసర సమాచారంపై వెంటనే స్పందించాలని సూచించారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే సమయంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఎక్కడ సమస్య తలెత్తే అవకాశం ఉందో ముందుగానే గుర్తించి, అక్కడ అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రహదారులు, వాగులు, వంకలు, చెరువులు, డ్రైనేజీ వ్యవస్థల పరిస్థితిపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా వర్షాల కారణంగా జరిగిన నష్టం పై వెంటనే వివరాల నివేదికను అందజేయాలన్నారు. ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురిసినప్పుడు అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ గూగుల్ మీట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్ వెంకన్న, జడ్పీ సీఈఓ శేషాద్రి, పరకాల మున్సిపల్ కమిషనర్ పవన్, సాగునీటి పారుదల శాఖ ఈఈ మంగీలాల్, రోడ్లు,భవనాలు శాఖ ఈఈ దేవిక చౌహన్, ఇతర శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి



అక్షరశక్తి, వరంగల్ : ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాలుగో జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు కోరారు. గురువారం పట్టణంలోని న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ 28న మధ్యాహ్నం 12 గంటలకు పెవిలియన్ గ్రౌండ్ నుంచి ప్రజా ప్రదర్శన, మధ్యాహ్నం 2 గంటలకు ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కాలేజీ గ్రౌండ్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య అధ్యక్షత వహిస్తారని, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆశిష్ మిట్టల్, తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు, అధ్యక్ష కార్యదర్శులు మామిడాల బిక్షపతి, గౌని ఐలయ్యతో పాటు వివిధ రాష్ట్రాల నాయకులు ప్రసంగిస్తారని తెలిపారు. 29, 30 తేదీల్లో ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ప్రతినిధుల సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి ప్రారంభ ఉపన్యాసం చేస్తారని, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్ తొలిపలుకులు, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వేణు ప్రసంగిస్తారని తెలిపారు. కార్పొరేట్ వ్యవసాయం, బలవంతపు భూసేకరణ, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు, రుణమాఫీ చట్టం, గ్రామీణ ఉపాధి హామీ పథకం, పర్యావరణం తదితర అంశాలపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కుల తిరుపతి, ఉపాధ్యక్షుడు గట్టి కృష్ణ, నాయకులు భీమగాని మల్లయ్య, ఐలయ్య, ఐఎఫ్‌టీయూ నాయకులు కుమార్‌స్వామి, బండి కుమార్, గొర్రె ప్రదీప్, పీవైఎల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంజిత్, ఆకుల వెంకట్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు గుర్రం అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక సదనం నుంచి మరో దత్తత

- బాలికను అభినందించిన కలెక్టర్
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

అక్షరశక్తి, హన్మకొండ : ప్రభుత్వ బాలిక సదనంలో రక్షణ సంరక్షణ విద్యా బుద్ధులు నేర్చుకొని తన ఇష్టాలకు అనుగుణంగా దత్తతకు ఒప్పుకొని కేంద్ర దత్తత ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు గురువారం రోజున నల్గొండ జిల్లాకు చెందిన దంపతులకు కలెక్టర్ ఛాంబర్ లో చట్టబద్ధమైన దత్తత అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ... చట్టబద్ధమైన దత్తత శ్రేయస్కరమని అన్నారు. కాగా దత్తత కి ఇచ్చిన బాలికతో, దత్తత తీసుకున్న తల్లితండ్రులతో కలెక్టర్ మాట్లాడి దత్తత తీసుకొన్న బాలికను బాగా చదివించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం విశ్వజ, బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సిహెచ్ అవంతి, ప్రభుత్వ బాలికల సదనం సూపరింటెండెంట్ ఎం కల్యాణి, ఇంచార్జి డిసిపిఓ ఎస్ ప్రవీణ్ కుమార్, సోషల్ వర్కర్ సంగి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

100 మందికి ఎగ్ కార్టుల పంపిణీ



అక్షరశక్తి, వర్ధన్నపేట : నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (ఎన్ఈసీసీ) ఆధ్వర్యంలో వర్ధన్నపేట నియోజకవర్గంలోని వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు మండలాలకు చెందిన సుమారు 100 మంది లబ్ధిదారులకు ఎగ్ కార్టులను పంపిణీ చేశారు. శ్రీ సత్యనారాయణ స్వామి కోళ్ల ఫామ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ఎగ్ కార్టులను పంపిణీ చేశారు. వరంగల్ జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు, అరూరి గట్టుమల్ల మెమోరియల్ ఫౌండేషన్ (ఏజీఎఫ్) కార్యదర్శి అరూరి విశాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ కోడిగుడ్డులో నాణ్యమైన ప్రొటీన్‌తో పాటు శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, ఇతర పోషకాలు లభిస్తాయని తెలిపారు. పిల్లల ఎదుగుదల, కండరాల అభివృద్ధి, శక్తికి కోడిగుడ్డు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. అందుబాటులో ఉండే ధరలో అధిక పోషక విలువలు అందించే ఆహారంగా కోడిగుడ్డును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్‌రావు, ఎస్ఈసీసీ జనరల్ మేనేజర్ డా.ఎజిల్‌కుమార్, రాజీవ్, కోళ్ల రైతులు సుబ్రహ్మణ్యం, దిలీప్‌రావు, స్థానిక నాయకులు, పౌల్ట్రీ రైతులు, లబ్ధిదారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాంప్‌లో గ్రూప్ కమాండర్ ఆకస్మిక తనిఖీ



అక్షరశక్తి, వరంగల్ : మామునూర్‌లోని పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ VIIను వరంగల్ గ్రూప్ కమాండర్ కల్నల్ రాజేష్ ఆర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత మామునూర్ ఎయిర్‌ఫీల్డ్‌లోని హ్యాంగర్ వద్ద జరుగుతున్న వాయుసైనిక్ శిక్షణను పరిశీలించారు. అనంతరం పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో గాడ్ ఆఫ్ ఆనర్, ఫ్లాగ్ ఏరియా, క్యాడెట్ల లైన్ ఏరియా, మెడికల్ ఇన్‌ఫర్మేషన్ రూమ్, కుక్‌హౌస్‌లను తనిఖీ చేశారు. అనంతరం టీచింగ్ క్లాసులను పరిశీలించి క్యాడెట్ల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్‌సీసీ ప్రాధాన్యం, ఎన్‌సీసీలో చేరడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. శిక్షణ ద్వారా దేశభక్తి, క్రమశిక్షణ, బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. క్యాంపులో శిక్షణ ఇస్తున్న అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు, కేర్‌టేకర్లకు పలు సూచనలు చేశారు. క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ డీవీ సంతోష్ మెహర్, వింగ్ కమాండర్ భాస్కర్ ధనాకే, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ విజయకుమార్ టి., క్యాంప్ సీనియర్ జేసీవో సంజయ్‌కుమార్ రానా పాల్గొన్నారు.





యుద్ధభూమి కాకతీయ యూనివర్సిటీ పాట విడుదల

అక్షరశక్తి,కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయం 50వ వసంతం లోకి అడుగుపెట్టిన సందర్భంగా రూపొందించిన "యుద్ధభూమి కాకతీయ యూనివర్సిటీ" ఫుల్ సాంగ్‌ను గురువారం విశ్వవిద్యాలయ ఆడిటోరియం లో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాపరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్ర చేతుల మీదుగా విడుదల చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఆవిర్భావం నుంచి 50 ఏళ్ల ప్రస్థానం, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విద్యార్థుల పోరాటం, మహనీయులు కలలుగన్న సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్రను ఈ పాటలో పొందుపరిచారు. విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్న పరిశోధనలు, ఉన్నత విద్య, విద్యార్థుల సామాజిక బాధ్యత వంటి అంశాలను ప్రస్తావిస్తూ కాకతీయ విశ్వవిద్యాలయం సాధించిన ప్రగతిని, ఘనతను కొనియాడేలా పాటను రూపొందించారు. విశ్వవిద్యాలయం 50 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా ప్రత్యేకంగా రూపొందించిన ఈ పాటకు నేరెళ్ల దేవేందర్ సాహిత్యం అందించగా, ఇనుగుర్తి మధు గానం చేశారు. ఈ పాట రూపకల్పనలో నిర్మాతలుగా రాచకొండ ప్రవీణ్, గుంపెల్లి గౌతమ్, ఎల్తూరి సాయికుమార్, శ్రీనాథ్ తదితరులు సహకరించారు. మ్యూజిక్ డైరెక్టర్‌గా ప్రశాంత్, ఎడిటర్‌గా ఆర్య అరవింద్, డీఓపీగా అరవింద్ నాని, డ్రోన్ పైలట్‌గా దేశెట్టి నవీన్, ట్యూన్ పాకగా రాజ్‌కుమార్ వ్యవహరించారు.



రంజిత్తులమారి S4S

- **ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ పేరుతో కోట్ల వంచన**
- **టేకుమట్ల నుండే జనాలకు టోకరా**
- **బడుగుల శ్రమను పిలుస్తున్న జలగ**
- **గార్డుల జీతాల సొమ్ముతో జల్సాలు**
- **తలెత్తిచూడని సంబంధిత అధికారులు**



అక్షరశక్తి, ప్రధాన ప్రతినిధి: నిరుద్యోగం, పేదరికంతో బతుకుదెరువు కోసం పట్టణాలకు వలస వచ్చే జీవులే అతనికి "ఆహారం". కుటుంబ పోషణకు, పొట్ట కూటి కోసం ఏదైనా చేసే వారికి కొంత ఆర్థిక "సెక్యూరిటీ" కావాలనుకునే వారే అతని పెట్టుబడి. ఉద్యోగాల కోసం ఎదురు చూసే వేలాది మందికి ప్రైవేట్ ఏజెన్సీలు సెక్యూరిటీ సిబ్బందిగా, గార్డుగా ఉద్యోగాలు కల్పిస్తాయి. బ్యాంకులు, షాపింగ్ మాల్స్, హాస్పిటల్స్ లో పని చేయడానికి ఈ ఏజెన్సీలను సంప్రదిస్తుంటాయి. దీనిని అడ్డంపెట్టుకొని S4S అనే ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థ మానవ వనరులను దోచుకొని, వారి చెమట చుక్కలతో జల్సాలు చేస్తున్నది. పేపరుపై వేతనాలు చూపి...సగం సొమ్ము స్వాహా చేస్తున్నది.

టేకుమట్ల ప్రాంతం నుండే టోకరా..

సాధారణ మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి చదువు సంధ్యలు లేకున్నా జనాన్ని మోసం చేసే పాఠం బాగానే చదువుకున్నాడు. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల ప్రాంతంలో చిట్టీల పేరుతో మందిని నిలువునా ముంచినట్లు ఆరోపణలు ఉన్నాయి. చిట్టీల పేరుతో జనాన్ని ముంచి లక్షలాది రూపాయలు ఎగ్గొట్టినట్లు తెలుస్తోంది. గ్రామంలో జనం తిరగబడటంతో అక్కడి నుంచి పారిపోయి, వరంగల్ పట్టణానికి వచ్చి కొత్త అవతారం ఎత్తిన రంజిత్తులమారి అతడు. ఎక్కడికెళ్లినా.. మాటలు చెప్పడం.. మందిని ముంచడం.. అక్రమంగా డబ్బులు సంపాదించడమే పనిగా పెట్టుకున్నాడు. ఈ క్రమంలో తెలిసిన మిత్రుల ద్వారా అతని కన్ను ఏజెన్సీ బిజినెస్ పై పడింది. అంతే... అతని పంట పండింది. ఈఎస్ఐ, ఈపీఎఫ్ ఖాతాల పేరుతో మోసాలకు తెర తీశాడు. జీతాల మోసంతో ఉద్యోగుల పొట్ట కొట్టి కోట్లు కూడబెట్టాడు.

వరంలా మారిన S4S

గత కొంత కాలంగా వరంగల్ లో ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ పేరుతో నయా దందా మొదలు పెట్టాడు. నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో సెక్యూరిటీ గార్డులను నియమిస్తూ, వారి నుండి అనధికారికంగా మూడు వేల నుండి ఐదు వేల రూపాయలు వరకు దండుకుంటున్నాడు. తన ఏజెన్సీ విస్తరణలో ఆసుపత్రులకు కాసుల ఎర వేసి ఏజెన్సీ ను దక్కించుకుంటాడని అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు పేరున్న రాజకీయ నాయకులు, అధికార పార్టీ నేతల పేర్లు, అధికారులు, విలేకరుల పేర్లు చెప్పుకుంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని తెలుస్తోంది. జీతం పూర్తిగా ఇవ్వడం లేదని అడగడమే పాపం... ఈ రంజిత్తులమారి ఇంటికి పిలిచి దెబ్బల రుచి చూపిస్తాడని ఒక బాధితుడు తన ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఒక ఏజెన్సీ నే బంగారు గనిగా మార్చుకొని తన దందాను నగరం అంతా విస్తరించాడు. చూస్తుండగానే.. ఏజెన్సీ దందాపై పట్టుసాధించి, అంతా నా ఇష్టం.. నాకెవ్వడు ఎదురు చెప్పేది..! అనే స్థాయికి చేరుకొని అడ్డూ అదుపులేని అక్రమాలకు పాల్పడుతున్నాడు. ఇంత జరుగుతున్నా ఏజెన్సీ ముసుగులో ఉద్యోగుల పీలుస్తున్నా సంబంధిత శాఖాల అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

యువత నాయకత్వ వికాసంలో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర

- **కేయూ వైస్‌ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి**







అక్షరశక్తి,కేయూ క్యాంపస్: యువతలో నాయకత్వ లక్షణాలు, సేవా స్ఫూర్తి, బాధ్యతాయుత పౌరసత్వాన్ని పెంపొందించడంలో జాతీయ సేవా పథకం (NSS) కీలక పాత్ర పోషిస్తోందని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా గురువారం విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో NSS ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. NSS ప్రోగ్రామ్ సమన్వయ అధికారి ఆచార్య ఈసం నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వైస్‌ఛాన్సలర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విశ్వవిద్యాలయం పరిధిలో 360కుపైగా NSS యూనిట్లు, సుమారు 35 వేల మంది వాలంటీర్లతో సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, విద్య, పరిశుభ్రత, నాయకత్వ వికాసం వంటి రంగాల్లో విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వైస్‌ఛాన్సలర్ తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా NSS వాలంటీర్లు సేవలందిస్తున్నారని, విద్యార్థుల్లో సేవా స్ఫూర్తితో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్నారని పేర్కొన్నారు. KHub ద్వారా వ్యవస్థాపకత, స్టార్టప్‌లు, ఆవిష్కరణలపై అవగాహన కల్పిస్తున్నామని, మాజీ పార్లమెంటు సభ్యులు ఆచార్య ఆజ్మీర్ సీతారాం నాయక్ సహకారంతో NSSకు శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. NSS ప్రోగ్రామ్ సమన్వయ అధికారి ఆచార్య ఈసం నారాయణ మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయ NSS రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక అవార్డులు, పురస్కారాలు సాధించిందన్నారు. మాజీ NSS సమన్వయ అధికారి, మాజీ పార్లమెంటు సభ్యులు ఆచార్య ఆజ్మీర్ సీతారాం నాయక్ మాట్లాడుతూ NSS తన జీవితంలో కీలకమైన అవకాశాలకు వేదికగా నిలిచిందని, ప్రజా సేవ పట్ల బాధ్యతను పెంచిందని తెలిపారు. NSS భవన్ నిర్మాణానికి సహకరిస్తానని పేర్కొన్నారు. తెలంగాణ అకాడమీ ఛైర్మన్, మాజీ NSS సమన్వయ అధికారి ఆచార్య కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ మేడారం సమ్మక్కసారలమ్మ జాతర వంటి భారీ కార్యక్రమాల్లో NSS వాలంటీర్ల సేవలు విశేషమని అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్య, వ్యక్తిత్వ, మానసిక వికాసానికి విశ్వవిద్యాలయం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా పూర్వ NSS వాలంటీర్లు రూపొందించిన 'సేవా కులం' పాటను ఆవిష్కరించారు. మాజీ NSS సమన్వయ అధికారులు, ప్రోగ్రామ్ అధికారులు, వాలంటీర్లు, ప్రస్తుత అధికారులు, వాలంటీర్లను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య టి. మనోహర్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎన్. రమణ, మాజీ NSS సమన్వయ అధికారులు ఆచార్య జి. బాలస్వామి, ఆచార్య ఎం. కిష్టయ్య, ఆచార్య బి. సురేష్ లాల్, ఆచార్య సుంకరి జ్యోతి, పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజు, ప్రోగ్రామ్ అధికారులు, NSS వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.





ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



అక్షరశక్తి, హైదరాబాద్: తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, చిరు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేసి, 12వ పీఆర్సీని అమలు చేయాలని కోరారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేయడం సరికాదన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, ఉద్యోగుల హక్కులపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. డీఏలు, పీఆర్సీ అమలుపై ప్రభుత్వం వాస్తవ గణాంకాలను ప్రజల ముందుంచాలని రాకేష్ రెడ్డి అన్నారు. ఉద్యోగుల వల్ల ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతున్నట్లు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఒక డీఏ అమలు చేసేలోపు మరో డీఏ పెండింగ్‌లోకి వస్తున్నందున అన్ని పెండింగ్ డీఏలను ఒకేసారి పరిష్కరించాలని కోరారు. సీపీఎస్ సమస్య పరిష్కారానికి మరో కమిటీ ఏర్పాటు చేయడం వల్ల ప్రయోజనం లేదని, ఇప్పటికే సమస్యలపై ప్రభుత్వానికి అవగాహన ఉన్నందున కాలపరిమితితో కూడిన పరిష్కారం చూపాలని అన్నారు. ఉద్యోగుల వేతనాల నుంచి ఈహెచ్ఎస్ కోసం 1.5 శాతం మొత్తాన్ని కట్ చేస్తున్నప్పటికీ వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని, ఈహెచ్ఎస్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన పెన్షన్, గ్రాట్యుటీ, ఇతర రిటైర్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన కోరారు. రూ.9 వేల నుంచి రూ.20 వేల వరకు స్వల్ప వేతనాలతో పనిచేస్తున్న ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, హోంగార్డులు, 104, 108 సిబ్బంది, ఆర్పీలు, వీవోఏలు తదితరుల సమస్యలను పరిష్కరించాలన్నారు. పీఆర్సీ, డీఏలు, ఓపీఎస్, ఈహెచ్ఎస్, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు, చిరు ఉద్యోగుల వేతనాలు తదితర అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన టైమ్‌లైన్ ప్రకటించి, ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి నిర్ణయాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు ప్రభుత్వ వ్యవస్థలో భాగమని, వారి సమస్యలు పరిష్కరించే వరకు బీఆర్ఎస్ వారి తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుందని రాకేష్ రెడ్డి స్పష్టం చేశారు.

ములుగులో వయోవృద్ధుల వారోత్సవాలు ప్రారంభం

అక్షరశక్తి, ములుగు: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ములుగు జిల్లాలో గురువారం వయోవృద్ధుల వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. అక్టోబరు 1 వరకు జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో భాగంగా ములుగు ఆర్డీఓ కార్యాలయంలో వయోవృద్ధులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు.

కార్యక్రమాన్ని ములుగు ఆర్డీఓ కె.కృష్ణవేణి, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా.ఎన్.గోపాల్‌రావు, జిల్లా సంక్షేమ అధికారి ఇ.పి.ప్రేమలత ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమం, రక్షణ, గౌరవప్రదమైన జీవనానికి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం2007పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వయోవృద్ధుల సమస్యలు, ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డా.ఎన్.గోపాల్‌రావు మాట్లాడుతూ వయోవృద్ధులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రక్తపోటు, మధుమేహం, కంటి సమస్యలు, ఎముకలు, కీళ్ల సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి వైద్య సేవలు పొందాలని తెలిపారు.

వయోవృద్ధుల సంక్షేమ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ వృద్ధులపై నిర్లక్ష్యం, అవమానాలు, వేధింపులను నివారించేందుకు ప్రత్యేక దృష్టి అవసరమని, వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. వారోత్సవాల్లో వయోవృద్ధుల హక్కులు, ఆరోగ్యం, భద్రత, సామాజిక భద్రత, ప్రభుత్వ పథకాలు, చట్టపరమైన రక్షణపై అవగాహన కల్పించనున్నట్లు ప్రేమలత తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర, ఎఫ్ఆర్ఓ గణేష్, ప్రణామ్ డే కేర్ సెంటర్ నిర్వాహకుడు చుంచు రమేష్, జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, వయోవృద్ధులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వయోవృద్ధులు సమాజానికి మార్గదర్శకులు



అక్షరశక్తి, హనుమకొండ: వయోవృద్ధులు మన జీవితానికి మార్గదర్శకులని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 24 నుంచి అక్టోబరు 1 వరకు నిర్వహించనున్న వారోత్సవ కార్యక్రమాలపై జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంఘం ప్రతినిధులతో గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి వృద్ధాశ్రమంలో వయోవృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, సంబంధిత అధికారులు కేంద్రాలను సందర్శించాలని సూచించారు. యోగా, ప్రాణాయామంపై అవగాహన కల్పించడంతో పాటు క్యారమ్, చెస్, పాటల పోటీలు నిర్వహించి వృద్ధుల్లో ఉత్సాహాన్ని పెంచాలని తెలిపారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం-2007, నిబంధనలపై అవగాహన కల్పించే ఫోమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

వయోవృద్ధుల కేంద్రాలు పాటిస్తున్న కనీస ప్రమాణాలు, సంబంధిత నివేదికలను త్వరగా అందించాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల సమాచార సంచిక, గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. వారోత్సవాల్లో భాగంగా 25న వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాల్లో క్యాటరాక్ట్ పరీక్షలు, ఆటవిడుపు కార్యక్రమాలు, 26న వృద్ధాశ్రమాల సామర్థ్య నిర్మాణం, పర్యవేక్షణ, రిజిస్ట్రేషన్ రెన్యువల్, కనీస ప్రమాణాలపై అవగాహన, 28న ఆర్థిక భద్రత, డిజిటల్ లిటరసీ, పెన్షన్, బ్యాంకింగ్ భద్రత, యూపీఐ చెల్లింపులు, సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 29న శాయంపేటలో ఇంటర్నేషనల్ బాండింగ్, లెర్నింగ్ డే కార్యక్రమం, 30న వాకథాన్, యోగా, ప్రాణాయామంపై అవగాహన, అక్టోబరు 1న జిల్లా స్థాయిలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. సమీక్షలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.విశ్వజ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డా.టి.మదన్‌మోహన్‌రావు, ఏడీఆర్డీఓ వెంకటేష్, జీసీడీఓ ఎస్.సునీత, ఏసీపీ సదయ్య, సీడీపీఓలు వి.సింధూరాణి, సీహెచ్.అవంతి, ఎస్ఐ శ్రావణి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు దేవాచారి, చంద్రమౌళి, ధర్మరాజు, లార్డ్ వృద్ధాశ్రమ నిర్వాహకుడు నరేష్, జిల్లా మహిళా సాధికారత మిషన్ సమన్వయకర్త దొమ్మేటి కల్యాణి, ఇన్‌చార్జి డీసీపీఓ ఎస్.ప్రవీణ్‌కుమార్, ఎఫ్ఆర్ఓ రవికృష్ణ, ప్యానల్ అడ్వకేట్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

"న్యూస్ పేపర్"

అది న్యూస్ పేపర్,తెల్ల పేపరా అన్నది కాదు,
న్యూస్ పేపర్ అయితే చదవాలి.. తెల్ల పేపర్ అయితే రాయాలి
ఆ న్యూస్ పేపర్ పేరు ఉన్నదా, పేరు లేనిదా అని కాదు,
పేపర్ కు నేను సదా బానిస,
అమ్మ సరోజన అక్క దుకాణానికిపాయ్యి పాట్లముల కట్టుకొచ్చిన
పేపర్ అయినా సరే చదవాలి గంతే,
చిన్నప్పుడు సాగర్ చాయ్ డబ్బా కాడాపేపర్ ఒకటి వచ్చేది
సద్వనికే పోయేది పాద్దుగాలనే..
ధబ్బున్న అక్కడ ఎవరైనా చదువుతుంటే చదివే వరకు ఆగి
మరీ చదివే వచ్చేది....
మంగళి శీనన్న కాడికి అమ్మ చెప్పిన
చిన్న కటింగ్ మిల్కీ కటింగ్ కు
పోతే గాడ కూడా ఆదివారం రోజు,
బుక్ ఒకటి పేపర్ ఒకటి గంటలు గంటలు చదివేది,
ఇంటికి వచ్చినంక అమ్మ అడిగేది,
ఇంతసేపు ఎందుకు అయింది రా అని
అమ్మకు అడిగితే అబద్దమే చెప్పేది,
అక్కడ చాలా మంది ఉన్నారని...
సెంట్రల్ జైలు ముందున్న గ్రంధాలయానికి
ఎప్పడన్నా పోతే అన్ని పేపర్లు చూస్తే
అవి నాకు ఇప్పటి మాటల్లో,అంటే
ఐఫోన్ లాగా సాంసంగ్ లాగా వివో రెడ్మీ
రియల్ మీ ఫోన్ లలాగా కనిపించేవి..
అన్ని ఆ పేపర్లు చదివితే కడిపే నిండేది.
గిప్పుడైతే అందరు ఫోన్లకు అడిక్ట్..
అప్పట్లో మాత్రం పేపర్లకు చాలామంది ఫాన్స్ ఉండేది.
ఎప్పడన్నా కోపం వస్తే అప్పడొ ఇప్పడొ
1000 రూపాయలు 500 నోట్ల నన్నచింపిన గాని
న్యూస్ పేపర్ ని ఏనాడు చింపలేదు,
ఇప్పటికీ దేవుని ఫోటోల కిందనో సెల్ఫ్ లలో
న్యూస్ పేపర్ ను అసలే వెయ్యనీయ
ఎందుకంటే పేపర్లో జ్ఞానం ఉన్నది...
విజ్ఞానం ఉన్నది, సమాచారం ఉన్నది
ఎదిగే ఎన్నో అవకాశాల
నైపుణ్యం దాగి ఉన్నది..
ప్రశ్న ఉన్నది, సమాధానం ఉన్నది
సమాజంలో ఏం జరుగుతుందో తెలుసుకునే
అవకాశం ఉన్నది.. కాబట్టి
ఇక మా అమ్మ అప్పడప్పడు అనేది
గిన్ని పేపర్లు చదువుతావు కదరా నువ్వెప్పడూ పేపర్లో
పడతావని
నేననేది నేను పడకపోయినా
నిన్ను పడిపిత్త పేపర్ల అని,ఇద్దరం నవ్వుకుని ఊకునేది.

- బొల్లం రాజేష్

హనుమకొండకు ఆర్టీసీ బస్సులు నడపాలి



అక్షరశక్తి, నర్సంపేట: నర్సంపేట మున్సిపాలిటీ 16వ వార్డు పరిధిలోని మాదన్నపేట, నాగార్జునపల్లి, పర్మ నాయక్‌తండా, నారాయణతండా, తిమ్మంపేట, లక్కినేపల్లి మీదుగా హనుమకొండకు రోజుకు రెండు ఆర్టీసీ బస్సు సర్వీసులు మంజూరు చేయాలని 16వ వార్డు కౌన్సిలర్ బానోతు నవీన్ నాయక్ కోరారు. ఈ మేరకు గురువారం హనుమకొండలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ భవానీ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ నాయక్ మాట్లాడుతూ ఆయా గ్రామాలు, తండాల ప్రజలకు హనుమకొండకు వెళ్లేందుకు సరైన ప్రజా రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు, కూలీలు, ఉద్యోగులు, వ్యాపారులు, కూరగాయల వ్యాపారులు నిత్యం హనుమకొండకు రాకపోకలు సాగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం ఆయా గ్రామాల మీదుగా రెండు బస్సు సర్వీసులు ప్రారంభించాలని కోరారు. బస్సులు అందుబాటులోకి వస్తే ప్రజలకు రవాణా ఇబ్బందులు తొలగుతాయని తెలిపారు.

GUEST COLUMN

‘సర్’ వేసే పిల్లిమొగ్గలకు... ఓటరే సంజాయిషీ చెప్పాలా!



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో ఓటర్ల జాబితా సవరణ జరుగుతున్న తీరు చూస్తుంటే, ప్రజాస్వామ్యంలో ఓటు వేయడం కంటే ముందుగా ఓటరుగా తాను బతికున్నానని నిరూపించుకోవాల్సిన దుస్థితి కనిపిస్తోంది. ఓటు హక్కు రాజ్యాంగం ఇచ్చిన హక్కా, లేక ఎన్నికల సంఘం అనుమతితో అప్పుడప్పుడూ పునరుద్ధరించుకోవాల్సిన లైసెన్సా అన్న సందేహం సామాన్యుడికి రావడం సహజం. బీహార్‌లోనో, పశ్చిమ బెంగాల్‌లోనో, కేరళలోనో, తమిళనాడులోనో ... రాష్ట్రం ఏదైనా, ఎన్నికల కమీషన్ సృష్టి ‘సర్’ అనేది బీజేపీ చేతిలో పాశుపతాస్త్రంలా పనిచేస్తూ, దాని పక్షపాత వైఖరికి గురికానివారు అరుదు. దాని తాకిడితో ఓటరుకు తిప్పలు తప్పడం లేదు.

ఇప్పటివరకు ఈ ప్రక్రియలో సామాన్యుల పేర్లు, ముఖ్యంగా పేదలు, ఇల్లూ వాకిలీ లేని వారు, పేవ్‌మెంట్లపై జీవించే వారు, మైనారిటీలు(ముస్లింలు, క్రీస్టియన్లు,ధిమాగి నక్సల్స్ , సంపాదకులు, జర్నలిస్టులు, ప్రొఫెసర్లు, బీజేపీకి అసలు ఓటు వేయరు అని ముందుగానే నిర్ధారణకు వచ్చిన మొదలైన) వర్గాల వారి పేర్లు, ఏదో ఒక కారణంతో ప్రశ్నార్థకంగా మారుతున్నాయన్న విమర్శలు వినిపించాయి. ఇప్పుడు ఆ ‘సర్’ మహిమ ప్రముఖుల గడప తొక్కింది. దేశ రాజధానిలో నివసిస్తూ రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవులు నిర్వహించిన వారికీ సైతం నోటీసులు అందుతున్నాయంటే,ఈ సర్ ప్రక్రియ ఎంత కుట్రపూరితంగా , హాస్యాస్పదంగా సాగుతోందో చెప్పడానికి ఇంతకంటే మరో సాక్ష్యం కావాలా!?

మాజీ ప్రధాని ఎల్.కె. అద్వాణీ, ఆయన కుమార్తె, కోడలు, విదేశాంగ మంత్రి జైశంకర్, కాగ్ చీఫ్ కె. సంజయమూర్తి, సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు డీవై చంద్రచూడ్, బీఆర్ గవాయ్, మాజీ ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్, సైనిక దళాల మాజీ చీఫ్ ఉపేంద్ర ద్వివేదీ, సెబీ చీఫ్ తుహిన్ కాంత పాండే, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కెజ్రీవాల్, మాజీ విద్యా శాఖ మంత్రి మనీష్ సిసోడియా వంటి ప్రముఖుల పేర్లు కూడా ఈ వ్యవహారంలో ప్రస్తావనకు వచ్చాయి. చివరకు ఎన్నికల కమిషనర్ డాక్టర్ ఎస్.ఎస్. సంధూ పేరు కూడా కనిపించిందట. అయితే ఆయన పేరు ఇప్పటికే చేర్చినట్లు ఈసీ వివరణ ఇచ్చింది. భారతరత్న ప్రొఫెసర్ సీఎస్ఆర్ రావు విషయంలోనూ ఇలాంటి గందరగోళమే వెలుగులోకి వచ్చింది.

ఎవరికో 2002 నాటి జాబితాతో మ్యాపింగ్ కాలేదట. మరొకరి పేరులో ‘తార్కిక వ్యత్యాసం’ ఉందట. ఇంకొకరి విషయంలో తండ్రి, కొడుకుల వయసుల మధ్య తేడా సరిపోలడం లేదట. మరొకరి పేరు స్పెల్లింగ్ విషయంలో అనుమానం వచ్చిందట. అంటే ఓటరుగా ఉండాలంటే పేరు సరిగ్గా ఉండటమే కాదు, తండ్రి వయసు, కొడుకు వయసు, తాత వయసు కూడా ఎన్నికల సంఘం గణితానికి తగ్గట్టుండాలన్నమాట!

ఇంతకీ ఈ ప్రక్రియలో అసలు అద్భుతం ఏమిటంటే—ముందుగా అనుమానం, తర్వాత నోటీసు, ఆ తర్వాత సంజాయిషీ, చివరికి విచారణ. ఆన్‌లైన్‌లో తప్పులు సరిచేసుకునే అవకాశం ఉందని ఈసీ చెబుతోంది. వాదన వినిపించుకునే అవకాశం ఇస్తామని, విచారణ పూర్తయ్యే వరకు పేర్లు తొలగించబోమని కూడా ఎన్నికల కమిషన్ ఓటర్లకు దయతో భరోసా ఇస్తోంది. ప్రజాస్వామ్యంలో ఓటర్ జాబితాలో తన పేరు ఉన్నందుకు భారత ఎన్నికల కమీషనర్ కు కృతజ్ఞతలు చెప్పాల్సిన దుస్థితి వచ్చింది.

పెన్షన్ తీసుకునే వృద్ధుడిని గుర్తుకు తెచ్చేలా ఈ ప్రక్రియ ఉంది. ఏడాదంతా బతికే ఉన్నా, ఒక రోజు ‘లైఫ్ సర్టిఫికెట్’ చూపించకపోతే పింఛన్ ఆగిపోతుంది. అదే తరహాలో, ఎన్నికల జాబితాలో సంవత్సరాలుగా పేరు ఉన్న పౌరుడు కూడా ఒక్కసారిగా ‘ఆ ఓటరును నేనే’ అని ఆధారాలు చూపించు కోవాల్సిన దుస్థితి వస్తే, ప్రజాస్వామ్యంలో ఎన్నికల వ్యవస్థకు ఇంత కంటే దుస్థితి ఇంకేం ఉంటుంది. బ్రతికి ఉన్న ఓటర్లపై నమ్మకం కన్నా పైళ్లపై నమ్మకం పెరిగినట్టే.

ప్రముఖులకు నోటీసులు వస్తే దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుంది. మీడియా దృష్టి పడుతుంది. వివరణలు వస్తాయి. చివరికి వారి పేర్లు జాబితాలోనే ఉంటాయి. కానీ పేవ్‌మెంట్‌పై జీవించే ఓటరుకు నోటీసు వస్తే అతని గొంతు ఎక్కడ వినిపిస్తుంది? అతని దగ్గర ఇంటి పత్రాలు లేకపోవచ్చు, పాత రికార్డులు లేకపోవచ్చు, ఆన్‌లైన్ ప్రక్రియ తెలియకపోవచ్చు. అతను ఎన్నికల సంఘం కార్యాలయాల చుట్టూ తిరిగేలోపు ఎన్నికల ప్రక్రియే ముగిసిపోవచ్చు. ఇదే అసలు ప్రశ్న.

ఢిల్లీకి సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితా ఆగస్టు 31న విడుదలైన మూడు వారాలకే తాజా నోటీసులు రావడం కూడా చర్చకు దారితీసింది. గత జాబితాలోని 33 శాతం పేర్లు గల్లంతయ్యాయన్న వాదన కూడా వినిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ‘ప్రక్రియ నిష్పాక్షికమే’ అని చెప్పడం సరిపోదు. సామాన్యుడికి అర్థమయ్యేలా, పారదర్శకంగా, గణాంకాలతో సమాధానం చెప్పాల్సిన బాధ్యత కూడా ఉంటుంది.

ఇక ఎన్నికల సంఘం ఇతర బాధ్యతల సంగతేమిటన్న ప్రశ్న కూడా ఉంది. 2024 ఎన్నికల ఈవీఎంలపై ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ నేతలు, డాక్టర్.పరకాల ప్రభాకర్ వంటి మేధావి లేవనెత్తిన ప్రశ్నలకు ఈసీ స్పందనపై చర్చ సాగుతుండగానే, ఓటర్ల జాబితా సవరణలో పేరుతో ఇంతటి హంగామా సృష్టించడం ఎందుకు అన్న సందేహం కలగడం సహజం.

‘సర్’ లక్ష్యం ఓటర్ల జాబితాను శుద్ధి చేయడమే అయితే, ఆ శుద్ధి ప్రజల హక్కులను మురికిలో కలపకుండా జరగాలి. ఓటరు తన పౌరసత్వాన్ని, తన చిరునామాను, తన కుటుంబ సంబంధాలను, తన పేరును ప్రతిసారీ నిరూపించుకుంటూ తిరగాల్సిన వ్యవస్థ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందా?, లేక పౌరుడినే అనుమానితుడిగా మారుస్తుందా ? అన్నదే అసలు ప్రశ్న.

చివరికి ‘సర్’ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కావచ్చు. కానీ సామాన్య ఓటరుకు మాత్రం అది ‘సార్, నా పేరు ఎందుకు తీసేశారు?’ అనే ప్రశ్నగా మారకూడదు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల సంఘం ఓటరును పరీక్షించేది కాదు; ఓటు హక్కును కాపాడేది. ఆ చిన్న తేడా మరిచిపోతే, ఓటర్ల జాబితా శుద్ధి పేరుతో ప్రజాస్వామ్యానికే ‘లైఫ్ సర్టిఫికెట్’ అడిగే రోజు దూరంలో ఉండకపోవచ్చు.

ఎన్నికల సంఘం సభ్యుల మధ్యనే ‘సర్’పై ఏకాభప్రాయం లేదు:

ఎన్నికల సంఘం స్వయంప్రతిపత్తి, నిష్పాక్షికతపై దేశంలో చర్చ జరుగుతున్న సమయంలో ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ 23-9-2026 న, వెలువరించిన తాజా పరిశోధనాత్మక కథనం మరింత కీలకమైన ప్రశ్నలను ముందుకు తెచ్చింది. గత పది నెలల్లో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి కలిసి కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల సంఘం తీసుకున్న చర్యలపై రికార్డులో అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఆ కథనం పేర్కొంది. ఒక్క రోజే నాలుగు అభ్యంతరాలు నమోదయ్యాయి. ఇవి సాధారణ పరిపాలనా విభేదాలు కాకుండా ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, పేర్ల పునరుద్ధరణ, ఫారం-6 మార్పులు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ వంటి ఎన్నికల వ్యవస్థకు మూలమైన అంశాలకు సంబంధించినవిగా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తెలిపింది. ఇక్కడ అసలు ఆందోళన ‘స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్’ (ఎస్ఐఆర్) ఉండాలా వద్దా అన్నది మాత్రమే కాదు. ఒక రాజ్యాంగ సంస్థలో నిర్ణయాలు ఎలా తీసుకుంటున్నారు? ముగ్గురు సభ్యుల కమిషన్‌లో ప్రతి సభ్యుడి పాత్ర ఎంతవరకు గౌరవించబడుతోంది? అన్నదే ప్రధాన ప్రశ్న. 2023 చట్టంలోని సెక్షన్ 18 ప్రకారం కమిషన్ వ్యవహారాలు సాధ్యమైనంత వరకు ఏకాభప్రాయంతో సాగాలి; అభిప్రాయ భేదం వస్తే మెజారిటీ నిర్ణయం అమలవుతుంది. అంటే భిన్నాభిప్రాయానికి చట్టంలోనే స్థానం ఉంది. కానీ ఇద్దరు కమిషనర్లు తమకు తెలియకుండానే కొన్ని నిర్ణయాలు తీసుకున్నారని రికార్డులో అభ్యంతరం వ్యక్తం చేసినట్లయితే, ఆ నిర్ణయాల ప్రక్రియను బహిరంగంగా వివరించాల్సిన బాధ్యత మరింత పెరుగుతుంది. ప్రత్యేకంగా ఫారం-6 వ్యవహారం ప్రశ్నలను రేకెత్తిస్తోంది. కొత్త ఓటరుగా నమోదు కావడానికి ఉపయోగించే ఈ చట్టబద్ధ ఫారంలో ఎస్ఐఆర్‌కు సంబంధించిన కొత్త ప్రశ్నను చేర్చడంపై ఇద్దరు కమిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు నివేదిక చెబుతోంది. ఎన్నికల నిబంధనల్లో మార్పు చేయకుండా ఫారంలో ఇలాంటి మార్పు చేయవచ్చా అన్నదే వారి సందేహం. సంధు దానిని ‘అనధికారికం, చట్టవిరుద్ధం’గా పేర్కొని తొలగించాలని కోరినట్లు కూడా కథనం వెల్లడించింది.

ఇంకో ముఖ్యమైన అంశం ఓటర్ల డేటాబేస్. ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియలో రాష్ట్ర, జిల్లా స్థాయి ఎన్నికల అధికారులకు ఉన్న చట్టబద్ధ పాత్రకు బదులుగా డిజిటల్ వ్యవస్థ కేంద్రీకృతమైతే, సాంకేతిక నిర్ణయం ఒక అర్హుడి ఓటు హక్కుపై ప్రభావం చూపే ప్రమాదం ఉంటుంది. గోవాలో పత్రాలతో అర్హత నిరూపించిన 97 మంది ఓటర్ల విషయంలో స్థానిక ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు నిర్ణయం తీసుకున్నప్పటికీ సాఫ్ట్‌వేర్ పరిమితుల వల్ల వారి నిర్ణయాలను నమోదు చేయలేకపోయారని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తెలిపింది.

అయితే మరో వైపు ఎన్నికల సంఘం ఈ కథనంలోని ప్రధాన అభిప్రాయాన్ని అంగీకరించలేదు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన తుది నిర్ణయాలన్నీ ముగ్గురు కమిషనర్ల ఆమోదంతో ఏకగ్రీవంగానే జరిగాయని, అధికారిక ఉత్తర్వులు చట్టబద్ధమైనవేనని ఈసీ స్పష్టం చేసింది. కమిషనర్ల మధ్య చర్చల సమయంలో ప్రశ్నలు, పరిశీలనలు రావడం సహజమని, వాటిని తుది నిర్ణయంపై విభేదంగా చూడరాదని పేర్కొంది.

అందువల్ల ఇప్పుడు అవసరమైనది ఆరోపణలపై రాజకీయ వాదోపవాదం కాదు; వాస్తవాలను ప్రజల ముందుంచే సంస్థాగత పారదర్శకత. 14 అభ్యంతరాలకు సంబంధించిన పూర్తి రికార్డులు, ఫారం-6 మార్పుకు ఆధారం, ఓటర్ల డేటాబేస్ నిర్వహణలో అధికారాల విభజన, గోవా 97 మంది కేసు, ఎస్ఐఆర్‌లో తొలగింపులు, పునరుద్ధరణలపై నిర్ణయ ప్రక్రియ వంటి అంశాలపై స్పష్టమైన వివరణ రావాలి. ఓటర్ల జాబితా కేవలం పరిపాలనా పత్రం కాదు; అది పౌరుడి ప్రజాస్వామ్య హక్కుకు ద్వారం. ఆ ద్వారం తెరవడంలోనూ, మూసివేయడం లోనూ, కంప్యూటర్ కోడ్ కన్నా చట్టం, అధికారి నిర్ణయం, పారదర్శక ప్రక్రియకే ప్రాధాన్యం ఉండాలి. ఎన్నికల సంఘంపై ప్రజల విశ్వాసం నిలవాలంటే, ఆ విశ్వాసానికి సమాధానం మాటల్లో కాదు—రికార్డుల్లో కనిపించాలి.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.